ట్రిపుల్ ఐటీ హైదరాబాద్- ప్లాక్ష యూనివర్సిటీ ఒప్పందం



ప్రొ. పీజేనారాయణన్, ప్లాక్షా వైస్‌చాన్స్‌లర్ ప్రొ.రుద్ర ప్రతాప్ సంతకాలు చేస్తున్న దృశ్యం

- 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' ఏర్పాటుకు నిర్ణయం
- ఒప్పందంపై సంతకాలు చేసిన ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: 'సుస్థిరత' కోసం 'ఉమ్మడి కేంద్రం' (సస్టేనబుల్ సెంటర్) ఏర్పాటు చేయాలని గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, ప్లాక్ష యూనివర్శిటీ సమిష్టిగా నిర్ణయించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పంద పత్రాలపై ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ సంతకాలు చేశారు. ఈ సెంటర్ ప్రాథమికంగా గ్రామాలు, పట్టణాల చుట్టూ ఉన్న పిరమిడ్ వినియోగ కేసుల పరిశోధనపై దృష్టి పెడుతుంది. ఇది గాలి, కాలుష్యం, నీరు, నెట్‌వర్క్‌లు, డబ్ల్యూటీపీ, ఎస్‌టీపీ, వర్షం, శక్తి, స్మార్ట్ మీటర్లు, పంపిణీ, గ్రిడ్‌లు, నిల్వ, వ్యర్థాల నిర్వహణ ఘనసీరు, ఇతరత్రా వాటితో పాటు ఆహారం/వ్యవసాయం వంటి ఫంక్షనల్ డొమైన్‌లలో సమస్యలను తీసుకుంటుంది.

ఉమ్మడి నిర్ణయాలు అమలు చేస్తాం

ఈ కేంద్రం ప్రభావవంతమైన పరిశోధన, విద్యా కార్యక్రమాలు, సమాజ ప్రమేయంపై పనిచేస్తుందన్నారు. మా మధ్య బంధం మరింత పెంచేందుకు ఈ ఒప్పందం ఎంతో దోహదం చేస్తుందన్నారు.ప్లాక్ష యూనివర్శిటీ వ్యవస్థాపక వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ రుద్ర ప్రతాప్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ నియామకం

- డివిజన్ల వారీగా కోర్ కమిటీలు
- బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ల వారీగా కోర్ కమిటీలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్టీని పటిష్టం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ కష్టపడితేనే చేవెళ్ళ పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధిస్తారని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీని శేరిలింగంపల్లిలో మరింత పటిష్టం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రభారి శ్రీనివాస్, కన్వీనర్ రాఘవేంద్రరావు, కార్యవర్గ సభ్యుడు రవీందర్‌రావు, నరేష్, బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా, ఇతర అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వసంతసిటీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు వసంత విల్లాస్, సంకల్ప్ అపార్ట్‌మెంట్స్, సైబర్‌వ్యాలీ, సైబర్ విలేజ్, వరల్డ్ వన్ స్కూల్, పరిసరాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

- 11కేవీ జేవీజీ హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు సెంట్రల్ పార్కు ఫేజ్-2, కేఎంఆర్ ఎస్టేట్స్, గాయత్రి లేఅవుట్, మాధవహిల్స్, కాంతివనమ్ వంటి ప్రాంతాలలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: 11 కేవీ లేక్ వ్యూ, 11 కేవీ నేతాజీనగర్ ఫీడర్ల పరిధిలో.. డబుల్ ఇళ్ల సముదాయంలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

- 11 కేవీ లేక్ వ్యూ ఫీడర్ పరిధిలో.. ఉదయం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు నల్లగండ్ల విలేజ్, మెయిన్‌రోడ్డు, అపర్ణ అపార్టుమెంట్స్ సైడ్, రత్నదీప్ సూపర్‌మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రాంతాలలో ...
- 11 కేవీ నేతాజీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు నేతాజీనగర్, గుల్‌మొహర్‌పార్కు కాలనీ, పార్కు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్: మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.30 గంటల నుంచి 9.00 గంట వరకు విశ్వంభర కాలనీ 2, శిల్పా ఎవెన్యూ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలో..

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.00 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల ప్రాంతాలలో ..
- వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 7.30 గంటల నుంచి 8.00 గంటల వరకు వైశాలీనగర్, ఉషోదయ ఎన్‌క్లేవ్, మంజీరా పైప్‌లైన్, ఏపీఎస్ జీఓ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- ఓల్డ్ బాంబే ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి 8.30 గంటల వరకు ఓల్డ్ బాంబే రోడ్డు, బీహెచ్‌ఈఎల్ రోడ్డు, గౌతమీనగర్, వేముకుంట భాగం, చందానగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రాయదుర్గంలో..

జీపీఆర్ఏ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటలవరకు జీపీఆర్ఏ క్వార్టర్స్, ఈపీటీఆర్ఐ, గచ్చిబౌలి ప్రధాన రోడ్డు, గ్రీన్ ల్యాండ్ కాలనీ, వినాయకనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని గచ్చిబౌలి ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు.

-ఏపీహెచ్‌బీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్ఎఫ్ గేట్ నెంబర్1,2,3, డాగ్ పార్క్, లీ మెరిడియన్, ర్యాడిసన్ హోటల్, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వైట్‌ఫీల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

వైట్‌ఫీల్డ్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ సాయిబాబా ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు శ్రీరామ్‌నగర్ సీ బ్లాక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదు.

- బొటానికల్ గార్డెన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు కొత్తగూడ, శ్రీరామ్‌నగర్ ఏబ్లాక్, బీబ్లాక్, పరిసరాల్లో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.


తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో .. ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు వెంకటాద్రినగర్, లింగంపల్లి, పోచమ్మ దేవాలయం ప్రాంతం, పీజేఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ప్రాంతం, శివాజీనగర్, తారానగర్, రామాచారి స్కూల్ వెనుకవైపు ప్రాంతం,తారానగర్ మజీదు, వెంకటరెడ్డికాలనీ, తేల్కర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

- డోయన్స్‌కాలనీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు డోయన్స్‌కాలనీ ప్రాంతంలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు.

గుడ్ ఫ్రైడే.. ప్రత్యేక ప్రార్థనలు

భక్తులతో కిటకిటలాడిన కల్వరి ప్రాంగణం






మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌కుమార్

హఫీజ్‌పేట్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం మియాపూర్‌లోని కల్వరి టెంపుల్ కిటకిటలాడింది. కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ పి.సతీష్ కుమార్ ప్రత్యేక ప్రార్థన అనంతరం క్రీస్తు సందేశాలను వినిపించారు. శిలువ ప్రదర్శన, క్రీస్తు జన్మనాటిక ప్రదర్శించారు. క్యాండిల్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లవారుజామునుంచే కల్వరి టెంపుల్‌కు పెద్ద ఎత్తున క్రైస్తవులు తరలివచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాలుగు ఆరాధన మహోత్సవాలను నిర్వహించారు. వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు భోజనం, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.

అసంపూర్తిగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

అధ్వానంగా రోడ్లు ..




చందానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్‌లో అంతర్గత రోడ్ల పరిస్థితి

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ బస్తీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారాయి. దీంతో అంతర్గత రోడ్ల కోసం ఎన్నికల ముందు హడావుడిగా శంకుస్థాపన చేశారు. నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనికితోడు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఇందిరానగర్ బస్తీలో సుమారు రూ.2.40 కోట్లతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, శ్మశానవాటిక, పైప్ లైన్ నిర్మాణాలకు ఎమ్మెల్యే గాంధీ గత సంవత్సరం సెప్టెంబర్ 22న శంకుస్థాపన చేశారు. బస్తీలో రోడ్డు మధ్యలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి ఇరువైపులా రోడ్డు వేయలేదు. దీంతో రాత్రి సమయాలలో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ బస్తీవాసులు చందానగర్ ప్రధానరోడ్డుకు వెళ్ళాలంటే చుట్టు తిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్తీలో యూజీడీ పనులతో రోడ్లు గుంతలు పడ్డాయని స్థానికులు వాపోయారు. రోడ్ల పైనే మట్టికుప్పలు, చెత్తాచెదారం దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా బస్తీలవాసులు కోరుతున్నారు.


ఇందిరానగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వద్ద అసంపూర్తిగా చాంబర్ల నిర్మాణం

శంకుస్థాపన చేసి వదిలేశారు



గత సంవత్సరం సెప్టెంబర్‌లో బస్తీలోని అంతర్గత రోడ్డు నిర్మాణం కొరకు హడావుడిగా శంకుస్థాపన చేశారు. కానీ తిరిగి ఇప్పటి వరకు నాయకులు మా బస్తీ వైపు కన్నెత్తి చూడలేదు. పలు అభివృద్ధి పనులంటూ కొబ్బరికాయలు కొట్టి వెళ్ళిపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అంతర్గత రోడ్డు పనులు ప్రారంభించే విధంగా దృష్టి సారించాలి.

– రాజేశ్వరాచారి, ఇందిరానగర్ బస్తీ

అసంపూర్తిగా మురుగు కాలువ పనులు



బస్తీలో గత ఏడాది అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కాలువ పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేశారు. కానీ రెండు చాంబర్లు నిర్మించకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికై నా ఈ చాంబర్లు నిర్మిస్తే బాగుంటుంది.

– రవి, ఇందిరానగర్ బస్తీ

జాతర ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మందుమూల శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లను శుక్రవారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం నుంచి సోమవారం వరకు జాతర జరుగుతుందని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం సుమధుర ఆర్ట్స్ అకాడమీ శ్రావ్య మానస శిష్యబృందంచే కూచిపూడి, జానపద నృత్యప్రదర్శనలను నిర్వహించి సందర్శకులను అలరించారు. నారాయణ అచ్యుత, అన్నమయ్య సంకీర్తనలు, శ్రీవిష్ణురాజంభజే, దశావతారం, శివాష్టకం, ధనశ్రీ, తిల్లాన తదితర అంశాలను కళాకారులు అమూల్య, స్పందన, సాహితి, దీక్షిత, శాన్వి, తన్వి, శివ, ప్రణీత ప్రదర్శించారు.

నేడు బీఆర్ఎస్ సమావేశం

రాయదుర్గం: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. మియాపూర్ నరేన్ గార్డెన్స్‌లో జరిగే బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి శేరిలింగంపల్లిలోని పార్టీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు


కొత్తగూడ ఫ్లైఓవర్, రోడ్లను పరిశీలిస్తున్న సీపీ అవినాష్‌మహంతి, సైబరాబాద్ ట్రాఫిక్ అధికారులు, ఎస్‌సీఎస్‌సీ బృందం

రాయదుర్గం: ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, అన్ని మార్గాల నుంచి కొత్తగూడ ఫ్లైఓవర్‌పై రాకపోకలకు ఏర్పాట్లు చేశారు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు. సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి ఆదేశాలపై సోమవారం నుంచి శుక్రవారం వరకు హఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్ళే వారు కొత్తగూడ ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్ళడానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అనుమతి. కొత్తగూడ ఫ్లైఓవర్, పరిసరాల రోడ్లను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, డీసీపీ మాదాపూర్ ట్రాఫిక్ డివి శ్రీనివాసరావు, అదనపు డీసీపీ ట్రాఫిక్ కె శివకుమార్, ఏసీపీ కె సత్యనారాయణ, ఎస్‌హెచ్‌ఓ ఎస్ రాజశేఖర్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ ఎస్ వెంకట రమణ, ఆర్.ఐ. ఎస్‌సీఎస్‌సీ బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఉండే ఏరియాల గురించి సీపీ ఆరా తీశారు. తగిన చర్యలు తీసుకోవాలని సీపీ అధికారులను ఆదేశించారు. సోమవారం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ఫ్లైఓవర్‌పై రాకపోకలకు హఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి నుంచి వెళ్ళేవారిని అనుమతించాలని నిర్ణయించినట్లు ట్రాఫిక్ అధికారులు వివరించారు.



కాంగ్రెస్ పార్టీలో చేరికలు

హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్‌చంద్రబోస్ నగర్‌లోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరువేస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీల నుంచి హమీద్, హనీఫ్, ఇస్మాయిల్ ఖాన్ ఆధ్వర్యంలో ఇబ్రహీం, ఉస్మాన్, అదృష్ట, సూర్యప్రతాప్ రెడ్డి, ఆసన్న, రిజ్వాన్, హఫీజ్, ఫిరోజ్, అమీర్, రఫీ తదితరులు చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం అధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, నాయకులు యాదగిరిగౌడ్, ప్రభాకర్ రెడ్డి, రాధాకృష్ణ, రేణుక, శేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారతదేశంలో యువశక్తికి కొదువ లేదు

- ఐఎల్ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి
- 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు ప్రారంభం

రాయదుర్గం: భారతదేశంలో యువ శక్తికి కొదవలేదని ఐఎల్ఓ డీసెంట్ వర్క్ టీమ్ సౌత్ ఏషియా, ఇండియా డిప్యూటీ డైరెక్టర్ సంతోషి ససాకి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో 64 ఇండియన్ సొసైటీ ఆఫ్ లేబర్ ఎకనామిక్స్ (ఐఎస్ఎల్ఈ) సదస్సు ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువశక్తిని వినియోగించుకోవడానికి వారికి చదువుతోపాటు తగిన నైపుణ్యం కలిగి ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా శక్తికి కూడా భారత్‌లో కొదువ లేదని, వారికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే వారి పనితీరు ఎంతో మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీఐ డీఈపీఆర్ ప్రిన్సిపల్ అడ్వైజర్ డాక్టర్ దేబాప్రసాద్‌రత్, హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, ఐఎస్ఎల్ఈ అధ్యక్షుడు ప్రొఫెసర్ దీపక్ నయ్యర్, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బద్రినారాయణ రథ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు ప్రొఫెసర్ అలోక్‌ఎన్ శర్మ, ప్రొఫెసర్ అలోక్‌కుమార్ మిశ్రా, సదస్సు అధ్యక్షులు రితుదీవాన్‌లు భారత దేశ ఆర్థిక విధానం, సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్, కోవిడ్ తర్వాత ఆర్థిక పరిస్థితి, కార్మిక విధానాలు వంటి అంశాలపై ప్రసంగించారు.అనంతరం 64వ ఐఎస్ఎల్ఈ సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.


హెచ్‌సీయూలో 64వ ఐఎస్ఎల్ఈ సదస్సులో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వారం పాటు ఉచిత వైద్యశిబిరం

రాయదుర్గం: మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏహెచ్ఏ క్లినిక్స్ పర్యవేక్షణలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకు న్యూరో అండ్ జనరల్ మెడిసిన్‌పై ఉచిత వైద్య శిబిరం జరగనుంది. టెలికామ్ నగర్ ప్రధాన రోడ్డులోని ఏహెచ్ఏ క్లినిక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుంది. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ కన్సల్టేషన్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ (సీబీపీ), ర్యాండమ్ బ్లడ్ షుగర్ (ఆర్‌బీఎస్), ఈసీజీ, బ్లడ్ ప్రెషర్(బీపీ), బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) వంటి పరీక్షలను కూడా నిర్వహిస్తారు. న్యూరాలజీ, పిడియాట్రిక్స్, సైకియాట్రీ వైద్యాధికారి డాక్టర్ జి అనంత్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9160884461లో సంప్రదించాలి.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ


మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్‌కు చెందిన చందన రేఖకు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలయిన రూ.2 లక్షల మంజూరు పత్రాన్ని శనివారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఎస్ఎన్ కిరణ్ యాదవ్, అక్కరావు, విమల, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

బంధం కొమ్ము చెరువు పరిరక్షణకు పోరాటం

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లోని బంధం చెరువును కాపాడాలని ప్రముఖ సోషల్ వర్కర్ 'జనం కోసం' సంస్థ వ్యవస్థాపకుడు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి డిమాండ్ చేశారు.బంధం కొమ్ము చెరువులో రాత్రింబవళ్లు మట్టి పోసి పూడ్చి వేస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు పరిరక్షించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. శుక్రవారం ఆయన అమీన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... బంధం కొమ్ము చెరువు పరిరక్షణ కోసం పోరాటం చేస్తామన్నారు. చెరువు పరిరక్షణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు.

బస్టాండ్ నిర్మించాలని వినతి


ఆర్ఎంకు వినతి పత్రాన్ని అందిస్తున్న రాజయ్య తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో బస్టాండ్ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య తెలిపారు. బస్టాండ్ నిర్మించాలని కోరుతూ శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ బస్టాండ్ లేకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండాకాలం దృష్ట్యా వెంటనే షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రతి నెలా సత్యనారాయణస్వామి వ్రతం

మోతీనగర్: కబీర్‌నగర్‌లో వేంచేసియున్న శ్రీ శివరామాంజేయ స్వామి ఆలయంలో ప్రతి నెల సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30న శనివారం ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు. ఈ వ్రతంలో దంపతులు పాల్గొనటానికి 616 రూపాయలు చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు. వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రిని ఆలయంలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

శ్రీవారి కల్యాణం

మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో ప్రతి శనివారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జీఏకె కృష్ణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పశువుల సంత

మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ప్రతి శని, ఆదివారం రెండు రోజుల పాటు రంగారెడ్డి జిల్లా నార్సింగ్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంత కొనసాగుతుంది. సంతలో రాష్ట్రంతో పాటు వివిధ జిల్లాల రైతులు వచ్చి అమ్మకాలు, కొనుగోలు చేపడతారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం


దట్టంగా అలుముకున్న పొగ

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ రహదారిలో గల స్క్రాప్ దుకాణంలో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్‌తో షాపులోని పేపర్లు, ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలకు మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికులు ఫైర్‌సిబ్బందికి సమాచారం అందించారు. పక్కనే గ్యాస్ ఏజెన్సీ ఉండడంతో సిబ్బంది సిలిండర్లను బయటకు తీసుకెళ్లారు. మూడు ఫైరింజన్ల సాయంతో రెండుగంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.